# లాకప్పు! - లాఠీఛార్జ్!

పోలీసులన్నా... పోలీస్టేషనన్నా రామకృష్ణకు చచ్చేటంత భయం! చిన్నతనంలో స్కూలు కెడుతుంటే సైకిలు మీద ఎదురయ్యే పోలీసును చూస్తే చాలు పక్కసందులోకి తుర్రుమనేవాడు.

దీనంతటికీ కారణం... చిన్నప్పుడు వాళ్ళబామ్మ... తను అన్నం తినకుండా మొరాయిస్తే... ఎవడైనా బూచాడొస్తాడని ఎత్తుకుపోతాడని భయపెట్టాల్సిందిపోయి... అడుగో పోలీసు... పిలవమంటావా...? నిన్నెత్తుకుపొమ్మంటావానేసి భయపెట్టటమే!

ఆవిధంగా రామకృష్ణ పసిమనసులో పోలీసంటే ఎక్కడలేని భయం చోటు చేసుకోనారంభించి... ఈనాటికీ ఆ ఫియర్ దూరమవకపోవటం ఓ బలహీనతగా మారింది.

రామకృష్ణ ఫ్రెండ్ వాళ్ల డాడీ ఎస్పై అని తెలుసుకున్న క్షణంనుంచి వాళ్ళింటికి వెళ్లటం మానేసాడు. స్నేహానికి కటీఫ్ చెప్పాడు.

పోలీసులంటే ఎంతగానో భయపడే రామకృష్ణ కాలేజీ ఫైనలియర్లో కాలేజీ ఫంక్షన్లో ప్రదర్శించబోయే నాటికలో పోలీసు వేషం తనను వేయమని లెక్చరర్ ప్రోద్భలం చేయటంతో 'నో' అన్లేక సరేనన్నాడు.

ముఖానికి రంగు పులుముకుని... పోలీసు యూనిఫారం వేసుకుని... టోపీ పెట్టుకుని... లాఠీ చేతబూని గ్రీన్‌రూమ్‌లో వున్న నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసి తాను ఝుడుసుకున్నాడు. అంతలోనే తెప్పరిల్లుకుని తన వీపు తానే చరుచుకున్నాడు. అయినప్పటికీ ఆ వేషం రామకృష్ణను ఇబ్బంది పెడుతూనే వుంది. ముచ్చెమటలు పోసి షర్ట్ తడిసింది.

తన వేషం రాగానే సైడు వింగ్‌లో వున్న తనను లెక్చరర్ ఒక్క తోపుతోయటంతో స్టేజీమీదికొచ్చి పడ్డాడు.

అంతే! చెప్పాల్సిన డైలాగ్స్ మరిచాడు. అయోమయంగా దిక్కులు చూశాడు. తన పాత్రకు ఆనాటికలో వున్నవే పది డైలాగులు. కంగారులో నోటికొచ్చిన నాలుగు డైలాగ్స్ చెప్పి సడన్‌గా ఎగ్జిట్ అయినాడు. గ్రీన్‌రూమ్‌లో కొచ్చి వంటినున్న యూనిఫారం విప్పి దూరంగా గిరవాటేసి బతుకుజీవుగా అనుకున్నాడు.

★★★★★

రామకృష్ణ బామ్మ పెంపకంలో పెరిగినవాడు కావటంతో మనిషి మెతక! భయస్తుడు!

తను నెలల పిల్లాడిగా వున్నప్పుడే తల్లిదండ్రి ఇద్దరూ స్కూటర్ యాక్సిడెంట్‌లో పోయారు పసితనంలోనే అమ్మానాన్నలను పోగొట్టుకున్నా రామకృష్ణను బామ్మ అతిగారాబంగా పెంచింది.

పాతికేళ్ళొచ్చి వుద్యోగం చేస్తున్నా... బామ్మ అన్నం ముద్దలు చేసి నోట్లో పెట్టాల్సిందే! అప్పుడు గాని కడుపు నిండినట్టనట్టు ఫీలవడు.

మనిషి అందగాడు! ఆరడుగుల ఎత్తు... వత్తైన కర్లీ హెయిర్... మంచి పలువరుస... కాంతివంతమైన కళ్ళు... సర్వవేళ సర్వావస్థలయందు నవ్వుతూ మాట్లాడే స్వభావం కలవాడు.

ఏ ఆడపిల్ల కంట్లో నలుసులాపడలేదు గాని... లేకపోతే అతగాడిని అమాంతం ఎత్తుకెళ్ళి బలవంతాన రాక్షస వివాహం చేసుకుని వుండేవాళ్ళు!

నెలకు పాతికవేలు సంపాదిస్తున్నా... సున్నిపిండితోనే వళ్ళు రుద్దుకుస్నానం చేస్తాడు. సీకాయతోనే తల రుద్దుకునే అలవాటు. ప్రతి ఆదివారం ఇప్పటికీ రామకృష్ణ వంటికి నలుగు పెట్టి వేడివేడి నీళ్ళు పోస్తూ అభ్యంగన స్నానం చేయిస్తుంది. సాంబ్రాణి పొగవేస్తుంది. తిలకం దిద్ది దేవుడికి దణ్ణం పెట్టుకోమంటుంది బామ్మ!

కాఫీ అలవాటు లేదు. ముప్పొద్దులా భోజనమే! సిగరెట్ అలవాటులేదు. మందంటే ఏమిటో.. దాని రంగు రుచి వాసన ఎరగడు.

'ఏమోయ్ రామకృష్ణా! నీ కేరియర్లో ఏం చద్ది కట్టి పంపింది మీబామ్మ..? ఏదీ కాస్త చూడనీ...' అనేసి తోటివాళ్ళు కామెంట్ చేసినా నొచ్చుకోడు.

లంచ్‌బాక్స్‌లో కందిపచ్చడి కలిపిన అన్నం... నాలుగు బంగాళాదుంపల వేపుడు ముక్కలు... పెరుగన్నంలో నంజుకుందుకు ఆవకాయ బద్ద తప్పించి మరో అయిటమేమీ బామ్మ నీకు పెట్టదేమిట్రా... అని కొలీగ్ ఏడిపించినా... తెలుగు సినిమాలో హీరోలా ఓ నవ్వు నవ్వేస్తాడు రామకృష్ణ.

'రొటీన్ భోజనంతో నీకు బోర్ కొట్టటంలేదా ఫ్రెండూ... ఎంచక్కా నీకు పెళ్ళి చేయమని బామ్మనడుగు. అప్పుడు... నీ శ్రీమతి నీకు రోజుకో రకమైన కొత్త వంట చేసి పెడుతుంది...' పరిహాసంగా మాట్లాడేడు మరో మిత్రుడు.

అవునవును! తనకు ఇంతవరకు పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనే తట్టలేదు సుమా... అనుకున్నాడు మనసులో! ఇహ లేటు చేయకూడదు... ఓ అందమైన ఆడపిల్ల మెడలో మూడుముళ్ళూ వేయాల్సిందే అనుకున్నవాడై...

ఈవినింగ్ ఇంటికి వెళ్ళగానే 'ఒసేవ్ బామ్మా... నాకు పెళ్ళెప్పుడు చేస్తావ్?... నాకు పెళ్ళి చేయాలని లేదా నీకసలు!' అంటూ కేకలేశాడు.

'ఓరి నా పిచ్చికొండా! నీకు సంబంధాలు చూస్తూనే వున్నాన్రా. బోలెడన్ని సంబంధాలు వస్తున్నాయ్. అన్నట్టు రేపు ఆదివారం మనం పిల్లను చూడటానికి వెడుతున్నాం...'

బామ్మ ఇచ్చిన రిప్లైకి రామకృష్ణ మనసు పులకరించి ఎగిరి గంతేసింది.

'నువ్ నా బంగారు బామ్మవి! చూడూ... పిల్ల సెలక్షన్ పూర్తిగా నాకొదిలెయ్. మిగతా విషయాలు నువ్ చూసుకో! ఏం!'

'అలాగే... నీకు నచ్చితే... సంబంధం ఖాయం చేసి... వెంటనే నీ పెళ్ళి చేసేస్తాను. ఇకపై నీకు అన్నం ముద్దలు చేసి నీ పెళ్ళామే నీ నోటికి అందిస్తుంది సరేనా!?!...' అనేసి అలమార్లో దాచిన అమ్మాయి ఫోటో తెచ్చి రామకృష్ణ చేతిలో పెట్టింది.

రకరకాల యాంగిల్స్‌లో ఫోటోలో అమ్మాయిని మార్చి మార్చి చూస్తూ 'ఈ పిల్ల బాగుందేవ్...' గావుకేక పెట్టాడు.

'ఓరి నీ ఆనందం బంగారం కానూ... సర్లే ఇంకేం అమ్మాయిని కూడా చూసొచ్చి సంబంధః ఖాయం చేసుకుందాం...'

బామ్మ జవాబుకి తలూపేడు.

★★★★★

అమ్మాయిని చూచి ఓ.కే. చేయటంతో పదిరోజుల వ్యవధిలోనే వివాహం జరిగింది.

శోభనం రాత్రి పెళ్ళికూతురు శోభన... తెల్లచీర కట్టుకుని... తల్లో మల్లెలు తురుముకుని... చేత పాలగ్లానుతో ఎంటరౌతుందని కలలు కంటున్న రామకృష్ణకి... పోలీసు ఎస్సై యూనిఫాంలో అప్పియర్ కావటం చూచి బెదిరిపోయి బావురుమన్నాడు.

'ఇదేంటీ?... దసరా వేషమా?' తెప్పరిల్లుకుని ప్రశ్నించాడు పెళ్ళాన్ని.

'డ్యూటీ ముగించుకుని నేరుగా ఇప్పుడే రావటం మైడియర్ హజ్బెండ్!... కొంచెం ఓపిక పడితే... స్నానం గట్రా చేసి... ఎంచక్కా పెళ్ళికూతురిలా సిగ్గు అభినయిస్తూ రీఎంట్రీ ఇస్తాను సరేనా!?... సారీ ఫర్ ది బ్రేక్...' అనేసి వెనుదిరిగింది శోభన.

డ్యూటీ అంటుందేమిటి?... ఇది నిజంగానే పోలీస్ ఎస్సై కాదు కదా?... ఓరి నాయనోయ్... పోయి పోయి ఇలాంటి తిక్కదాన్ని చేసుకున్నానేమిటి? ఓరి దేవుడోయ్... నా బతుకు

అడవిగాచిన వెన్నెలవుతుందేమో రోయ్... అనేసి గుండెలు బాదుకుంటూ వంటినున్న తెల్లసిల్క్ జుబ్బా చించేసుకున్నాడు. అటుపై బావురుమన్నాడు.

ఛీ!... సారీ... నో! ఇలాంటి పోలీసు ఎస్సై పెళ్ళాంతో చచ్చినా కాపురం చేయను. కాకీగుడ్డలంటేనే కంపరం... కాదు అసహ్యం... కాదు కాదు భయం?... ఇంకా అనేక విధాలుగ తలపోస్తూన్న తరుణంలో అచ్చు నూటికి నూరుపాళ్ళు శోభనం హీరోయిన్‌లా గదిలోకొచ్చిన శోభన ముఖంలోకి వింతగా... విచిత్రంగా చూస్తూ వుండిపోయాడు.

దేవుడు దశావతారాలెత్తినట్టు... ఇది నిముషానికో డ్రెస్‌లో నాముందు కొచ్చి నిలుస్తుందేమిటీ? ఇలాంటి రంగులు మార్చే భార్య తనకొద్దు అనుకున్నాడు.

బిత్తరచూపులు చూస్తూ మంచం దగ్గిరే నిలబబడిన భర్తని సమీపిస్తూ 'ఏం చేయను డియర్! కొత్తగా పెళ్ళిఅయిన దాన్నని తెల్సీ డ్యూటీ తప్పదన్నాడు మా సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ సన్నాసి. డ్యూటీ ఫినిష్ చేసుకుని ఉరుకులు పరుగులమీదొచ్చినా ఇదిగో ఈవర్తైంది. మొగుడివి నువ్వే కాస్త సర్దుకుపోవాలి...' చేతిలో పాలగ్లాసు పెదాలకు తగిలించింది.

ఉలికిపడినవాడిలా దూరంగా జరిగి 'నువ్ చెప్పేది నిజమా?... ఎస్సై జాబ్ చేస్తున్నావా?... నన్ను దగా చేశావ్... పెళ్ళికి ముందే ఈ విషయం నాతో ఎందుకు చెప్పలేదు... నిజం దాచి మోసంచేసి నన్ను కట్టుకున్నావ్! నో... నన్ను వంచించావ్... నే మోసపోయాను. కాకీగుడ్డల దానితో కాపురం చేయటం నావల్లకాదు... పోలీసోళ్లంటేనే నాకు చచ్చేటంత భయం. ఇక నీతో నేనేం సుఖపడి చావగలను? నన్ను తాకద్దు...' పిచ్చెక్కినవాడిలా అరుస్తూ... కేకలేస్తూ... శోభనం గదంతా గంతులేస్తూ... తలుపు గడియ తీసుకుని అంత రాత్రివేళ బామ్మ పడుకున్న గదివేపు పరుగుతీశాడు.

మనుమడు ఘనకార్యం చేస్తుంటాడీపాటికి అని మురిసిపోయే బామ్మ... సడన్‌గా రామకృష్ణ తన గదిలోకి పరుగెత్తుకు రావటం చూచి కంగారు పడింది.

'ఇలా వచ్చావేంట్రా పిచ్చి సన్నాసీ!... పెళ్ళాం పక్కలో పడుకోకుండా ఎందుకొచ్చావ్?...' గాభరా పడుతూ ప్రశ్నించింది అనసూయమ్మ బామ్మ.

మొగుడ్ని ఫాలో అవుతూ దొంగోడి వెనక పోలీసొచ్చినట్టు... బామ్మ బెడ్‌రూమ్‌లోకొచ్చిన శోభన 'నేను ఎస్సై ఉద్యోగం చేస్తున్నట్టు మీ మనుమడికి చెప్పలేదా?...' అంటూ కళ్ళెర్ర చేసింది.

అనసూయమ్మ అవాక్కయింది. లిప్తపాటు నోరు పెగల్లేదు. మొత్తానికి పరిస్థితి అర్థం చేసుకున్నదై... 'మావాడికి పోలీసులంటే చచ్చేంత భయం శోభనా... అందుకే ఈ విషయాన్ని

వాడితో చెప్పకుండా రహస్యంగా దాచాను. చెప్తే ఈ సంబంధం ఎక్కడ చెడిపోతుందోని భయపడ్డానంతే...! తప్పునాదే...' బిక్కుబిక్కుమంటూ జవాబిచ్చింది.

'అదా విషయం...! సర్లెండి. మీరేం దిగులుపడొద్దు. నే మేనేజ్ చేస్తాను...' అంటూ రామకృష్ణ చేయి గట్టిగా పట్టుకున్న శోభన ఓ నేరగాడినో... దొంగనో... కె.డి.నో 'కేచ్' చేసిన ఫీలింగ్‌తో... ఈడ్చుకెళ్ళి లాకప్‌లో పడేసినట్టు శోభనం గదిలోకి ఈడ్చి గది తలుపు గడియపెట్టింది.

తనకు లొంగిపొమ్మని... లేకపోతే లాఠీఛార్జ్ చేస్తానంటూ ఎక్కడ శోభన బెదిరిస్తుందోనని భయంతో వణికిపోతున్నాడు రామకృష్ణ.

ఇదేం ఖర్మరా దేవుడా... పెళ్ళాంతో రోజూ లాఠీదెబ్బలు తినక తప్పదు కాబోలంటూ మధనపడనారంభించాడు. నిండు నూరేళ్ళు బతకాల్సిన తనను ఎస్సై పెళ్ళాం రోజూ వళ్ళు హూనం చేసి అర్ధాయుష్షుతో హరీ అన్పిస్తుందేమిటి ఖర్మ... అనేసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

భర్త పరిస్థితికి జాలిపడింది శోభన! మొగుడి వేపు ప్రేమగా... లాలనగా చూస్తున్నట్టు 'లుక్' ఇచ్చింది. దగ్గరైంది.

మంచంమీద వెల్లకిలా పడుకున్న తన వద్దకు శోభన సమీపించగానే శోభనం సంగతి దేవుడెరుగు... నన్ను మాత్రం మాటలతో లాఠీఛార్జ్ చేయకు... నీకు పుణ్యముంటుంది. నువ్ చెప్పినట్టే చేస్తాను... నీ మాట వింటాను...' ప్రాధేయపడ్డాడు.

నిన్ను ఛార్జ్ చేసేది లాఠీతో కాదురా మగడా...! వాలుచూపులతో... చక్కిలిగింతలతో... తీయతీయని ముద్దుల్తో... సరేనా?! మీదపడి కౌగలించుకుని ముద్దులతో ముంచెత్తుతూ వుక్కిరి బిక్కిరి చేసింది.

అక్కడితో రామకృష్ణ మనసులో వున్న భయం పటాపంచలైంది!! నా పోలీసు పెళ్ళాం మంచిదేనని మురిసిపోయాడు.

- సమాప్తం -